## క్లుప్తంగా

### నాటుసారా విక్రయిస్తున్న ముగ్గురిపై కేసు



కాజీపేట: కాజీపేట రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతంలో 12లీటర్ల నాటుసారాతో పాటు ఆటో, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్ బుధవారం తెలిపారు. స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం ఇండియా తండాకు చెందిన గుగులోతు బాలి.. ప్రతిరోజు గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లో నాటుసారాతో కాజీపేటకు చేరుకుంటుంది. ఆమె రాక కోసం అప్పటికే సిద్ధంగా ఉన్న ఆటోలో వెళ్లి నాటుసారాను విక్రయిస్తున్నారు. ఈక్రమంలో నిఘా వేసిన సిబ్బంది.. బాలి రైలు దిగి ఆటో ఎక్కిన తర్వాత ఆమెతో పాటు పల్లెపు సాంబరాజు, పల్లెపు మహేష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ చెప్పారు. దాడుల్లో ఎస్సై తిరుపతి, ఖలీల్, కోటిలింగం,అయూబ్, పృథ్వీ, శివాని పాల్గొన్నారు.

### బుధరావుపేటలో ముఖద్వారం ప్రారంభం



ఖానాపురం : మండలంలోని బుధరావుపేట వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సొంత నిధులతో ఏర్పాటు చేసిన ముఖద్వారాన్ని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో బ్రహ్మోత్సవాలను నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎర్ల జగన్మోహన్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ మహాలక్ష్మి వెంకటనర్సయ్య, చెడిపాక ఉపేందర్, గిరగాని నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

### కేయూలో ముందస్తు అరెస్టులు



కేయూ క్యాంపస్: ప్రపంచ సుందరీమణుల వరంగల్ పర్యటన నేపథ్యంలో ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మర్రి మహేష్, వంశీకృష్ణ, డీఎస్‌ఏ బాధ్యుడు శ్రావణ్‌కుమార్, ఎస్ఎఫ్ఐ బాధ్యుడు స్టాలిన్, తదితరులను కాకతీయ యూనివర్సిటీ పోలీసులు బుధవారం ఉదయం అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై వదిలివేశారు.

### మున్నూరు కాపు సంఘం జిల్లా కమిటీ ఎన్నిక





దశరథం, అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి

హన్మకొండ: తెలంగాణ మున్నూరు కాపు సంఘం హనుమకొండ జిల్లా కమిటీని హనుమకొండ కేఎల్ఎన్ రెడ్డి కాలనీలో బుధవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కొత్త దశరథం, ప్రధాన కార్యదర్శిగా కొండా నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులుగా రాగంశెట్టి సత్యనారాయణ పటేల్, జినకల లక్ష్మణ్‌రావు, ఆకుల భూమయ్య, పుట్ట కిషోర్, ట్రెజరర్‌గా కూరపాటి సత్యప్రకాష్ రావు, జాయింట్ సెక్రటరీలుగా డాక్టర్ పంచనగిరి గిరిప్రసాద్, పత్రి శ్రీకాంత్, మీడియా కన్వీనర్లుగా మొగిలి శ్రీనివాసరావు, బండారి సతీష్ పటేల్ ఎన్నికైనట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిని రవీందర్ వివరించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ముఖ్య సలహాదారుడు రజనీకాంత్, పాల్గొన్నారు.

### పరకాల యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా మనోజ్



హసన్‌పర్తి: పరకాల యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా మండలంలోని కోమటిపల్లికి చెందిన నమిండ్ల మనోజ్ నియమితులయ్యారు. ఈమేరకు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి ప్రకటించారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డిని మనోజ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# నిర్మించారు.. వదిలేశారు

- నిరుపయోగంగా హాస్టల్ భవనం
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా
- పట్టించుకోని అధికారులు



ఖానాపురంలో నిరుపయోగంగా ఉన్న హాస్టల్ భవనం

ఖానాపురం: విద్యార్థుల కోసం లక్షలు వెచ్చించి నిర్మించారు. విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో భవనాన్ని వదిలేశారు. విద్యార్థులకు వసతి కల్పించడానికి నిర్మించిన హాస్టల్ భవనాన్ని విద్యార్థులు లేరనే సాకుతో వదిలేయడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతుంది. సాయంత్రం అయితే చాలు భవనమంతా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఖానాపురంలో బీసీ హాస్టల్‌ను నిర్మించారు. ఇందులో విద్యార్థులు కొన్నేళ్లపాటు విద్యాభ్యాసం చేశారు. పాలకుల నిర్లక్ష్యం కారణంతో విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. విద్యార్థుల సంఖ్యను పెంచాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో చివరకు పది మంది విద్యార్థులే మిగలడంతో మూడేళ్ల క్రితం మూతబడిపోయింది. మిగిలిన విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోయారు. బీసీ హాస్టల్‌ను కాస్తా పోస్టుమెట్రిక్ గర్ల్స్ హాస్టల్‌గా మార్చడంతో నర్సంపేటకు మార్చారు. ఆ తర్వాత నుంచి భవనం కాస్తా నిరుపయోగంగా మారిపోయింది. లక్షలు వెచ్చించి నిర్మించిన భవనం ఎలాంటి అవసరాలకు పనికి రాకుండాపోతుంది. దీంతో పిచ్చిమొక్కలతో పెరిగిపోయి భవనం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇతర ప్రభుత్వ కార్యకలాపాల కోసం వినియోగిస్తే బాగుంటుందనే అభిప్రాయాలను గ్రామ ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనాన్ని ప్రభుత్వ కార్యక్రమాలకు వినియోగించాల్సిన అవసరం ఉంది.

#### అందుబాటులోకి తీసుకురావాలి



బీసీ హాస్టల్ భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలి. పిచ్చిమొక్కలు పెరిగిపోయి అస్తవ్యస్థంగా తయారైంది. అధికారులు స్పందించాలి

– వద్దె రాజశేఖర్, ఖానాపురం

# అభివృద్ధికి బాలవికాస తోడ్పాటు



చేతిపంపును ప్రారంభిస్తున్న బాలవికాస, స్థానిక నాయకులు

నర్సంపేట : దేశ వ్యాప్తంగా పేదలు, బడుగు, బలహీన వర్గాలు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి బాలవికాస సహకారంతో చేతిపంపులు, వాటర్ ట్యాంకులు, ప్లాంట్లు, మరుగుదొడ్లు, ఆర్థికంగా వెనుకబడి చదువుకుంటున్న పిల్లలకు ఆర్థికసాయం, పుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్నామని బాలవికాస వాటర్‌ప్లాంట్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పుచ్చకాయల కృష్ణారెడ్డి, బాలవికాస చేతిపంపుల జిల్లా ఇన్‌చార్జ్ ప్రశాంత్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని మాదన్నపేట రోడ్డులోని కారల్ మార్క్స్ కాలనీలో బుధవారం చేతిపంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో 14 ఏళ్లుగా నివాసం ఉంటున్న పేదలకు మంచినీటి సౌకర్యం లేకపోవడంతో కాలనీవాసి, న్యాయవాది కందికట్ల వీరేష్ బాలవికాసకు దరఖాస్తు చేశారని తెలిపారు. స్పందించిన బాలవికాస సంస్థ బోరు వేసి పైపులైన్ ద్వారా బోరింగ్‌ను ఏర్పాటు చేసి ప్రారంభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కందికట్ల వీరేష్, దొమ్మాటి సంతోష్, కాలనీ వాసులు ఆరిఫ్, శివ, పెండ్యాల మల్లేష్, పులిపాక రాజేష్, రవళి, ముప్పారపు రాజు, బబా, ఈసంపల్లి మల్లేష్, నర్సమ్మ, శ్రీను, కోటి, చాంద్‌బి, హసీనా తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన



పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి

నల్లబెల్లి : మండలంలోని నారక్కపేటలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన బుధవారం ఘనంగా నిర్వహించారు. పురోహితుడు వీరభద్రయ్యాచారి వేదమంత్రోచ్చరణల మధ్య కార్యక్రమం వైభవంగా కొనసాగింది. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్‌లు వేర్వేరుగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అతిథులను శాలువాలతో సత్కరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవ రెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముదిరాజ్ కుల పెద్దలు సిద్దె కృష్ణంరాజు, నటరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# నైపుణ్యాలను పెంచడానికే శిక్షణ శిబిరం



వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

పర్వతగిరి : విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను పెంపొందించేందుకు వేసవి శిక్షణ శిబిరాలు ఉపయోగపడతాయని ప్రధానోపాధ్యాయుడు పాక రమేష్‌బాబు అన్నారు. స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో 6 నుంచి పదో తరగతి వరకు 15 రోజుల పాటు నిర్వహించిన వేసవి శిక్షణ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్ వంటి నైపుణ్యాలను పెంచుకోవడానికి, ఆటల వల్ల శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదగడానికి ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వం ప్రథమంగా ప్రారంభించిన ఈ కార్యక్రమం విజయవంతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి రోజు 60 మంది విద్యార్థులు ఈ క్యాంపునకు హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్, మహంకాళి రామస్వామి, పీఈటి సురేష్, జయరావు, స్పోకెన్ ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు సుప్రజ పాల్గొన్నారు.

# రైతుల సమస్యలపై ముందుండాలి

- రైతు సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజుయాదవ్



కవితకు నియామక పత్రం అందజేస్తున్న రాజుయాదవ్

నర్సంపేట : రైతు సంక్షేమ సేవా సంఘం బాధ్యులు రైతులకు అండగా ఉంటూ రైతుల సమస్యలపై ముందుండాలని రైతు సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆబోతు రాజుయాదవ్ కోరారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నర్సంపేటకు చెందిన వరంగంటి కవితను రైతు సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, జిల్లా కార్యదర్శిగా బాల్నె సుభాష్, ప్రచార కార్యదర్శిగా మోటం కన్నీ, బూస రంజిత్‌లను నియమించినట్లు ప్రకటించారు. రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్ము ప్రేమ్‌సాగర్‌యాదవ్ నాయకత్వంలో రైతులకు ప్రభుత్వం ద్వారా నాణ్యమైన విత్తనాలు, మొక్కలను అందిస్తూ గోశాలలో ఉండే గోవులను రైతులకు అందించే దిశగా కృషి చేయాలని ఆయన అన్నారు.

# ఉపాధి పనులకు దరఖాస్తు చేసుకోవాలి

ఐనవోలు : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సన్న, చిన్నకారు రైతులకు వ్యవసాయ అనుబంధమైన వ్యక్తిగత పనులు ప్రభుత్వ నిబంధనల మేరకు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ నక్క కుమారస్వామి బుధవారం ఓ ప్రకటనలో కోరారు. పండ్ల తోటల పెంపకం పథకంలో భాగంగా మామిడి, నిమ్మ, బత్తాయి, జీడీ మామిడి, జామ, సీతాఫలం, సపోటా, ఆయిల్ పామ్, అల్ల నేరడి, ఆపిల్‌బేర్, దానిమ్మ, మునగ, కొబ్బరి, డ్రాగన్ ఫ్రూట్ వంటి తోటల పెంపకంతో పాటు గట్లపై అల్లనేరడి, కొబ్బరి, సీతాఫలం, జామ, కరోడా వంటి పండ్ల మొక్కలు పెంచుకునేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఉపాధి కూలీలతో గుంతలు తీయించడం, ప్రభుత్వ నిబంధనల ప్రకారం మొక్కల ఖర్చు చెల్లించడం, అంతర పంటల నిర్వహణ, ఎరువులు, నీటి నిర్వహణ ఖర్చులు చెల్లించడం జరుగుతుందని పేర్కొన్నారు. అదే విధంగా పశువుల పాక, కోళ్ల, మేకల, గొర్ల షెడ్డు నిర్మాణం, అజోలా, ఎరువు గుంతలు, వ్యక్తిగత ఇంకుడు గుంతలు, బయోగ్యాస్ ప్లాంట్‌లకు కూడా ఉపాధి హామీ పథకంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల రైతులు ఈనెల 20వ తేదీలోపు సంబంధిత జీపీ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

# అడ్వాన్స్ లీడర్‌షిప్ క్యాంపునకు ఎంపిక



కేయూ క్యాంపస్: హుజూరాబాద్‌లోని కిట్స్ కళాశాలలో ఈనెల 14నుంచి పదిరోజుల పాటు నిర్వహించనున్న అడ్వాన్స్ లీడర్‌షిప్ క్యాంపునకు హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్లు సీనియర్ అండర్ ఆఫీసర్ కె.నివేదిక, భానురేఖ, ఎండీ.బాబా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ రెహమాన్, ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ ఎస్.స్వామి బుధవారం అభినందించారు. అలాగే, మామునూరులో జరగనున్న సీఏటీసీ -1క్యాంపులో పాల్గొనేందుకు వెళ్లిన పదిమంది ఎన్‌సీసీ కేడెట్లను సన్మానించారు.

# రిజిస్ట్రేషన్ చేసుకుంటేనే పథకాలు



ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపడుతున్న వ్యవసాయ అధికారులు

- మండల వ్యవసాయ శాఖ అధికారి నాగరాజు

నెక్కొండ : రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకుంటేనే కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరుతుందని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎగిడి నాగరాజు అన్నారు. మండలంలోని పనికర గ్రామంలో బుధవారం ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆధార్ కార్డులా.. రైతన్నకు విశిష్ట గుర్తింపు కార్డు ఇచ్చే ప్రక్రియ మండలంలో కొనసాగుతుందన్నారు. ప్రతి రైతు విశిష్ట గుర్తింపు కార్డు పొందాలని సూచించారు. అందుకు రైతులు పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్‌తో స్థానిక ఎంఏఓ, ఏఈఓల వద్ద నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం లబ్ధిదారులకు మూడు ఓటీపీలు వస్తాయని పేర్కొన్నారు. దాని ధ్రువీకరణ ద్వారా విశిష్ట సంఖ్యను కేటాయిస్తారన్నారు. ఈ సంఖ్యను కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు అనుసంధానం చేస్తారని రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ వసంత, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణాపాయస్థితిలో రామరాజు

- అత్యంత పేదరికంలో తుమ్మలపెల్లి
- వైద్యం కోసం ఆస్పత్రిలో అవస్థలు
- సాయంకోసం ఎదురు చూస్తున్న కుటుంబ సభ్యులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రామరాజు

దుగ్గొండి : అత్యంత పేద కుటుంబంలో పుట్టాడు. అయినా ఊరంతా అతడి కుటుంబమే. ఆ ఊరిలో ఏ కుటుంబంలో అశుభం అయినా శుభకార్యం అయినా ఆయన ఉండాల్సిందే. అన్నదాతలకు కరెంట్ సమస్య ఉన్నా.. ఇంట్లో కరెంట్ రాకపోయినా పిలుపు అందుకుని 108 వలే పనిచేసేవాడు. చావు అయినా పెళ్లి అయినా పరుగున వెళ్లి టెంట్ వేయడం, కుర్చీలు వేయడం ఆయన పని.. ఆ పనిలోనే సాయం చేశానని సంతృప్తి చెందేవాడు. ఇంతటి పరోపకారం, సేవా గుణం ఉన్న ఆయనపై కరెంట్ కక్ష గట్టింది. ట్రాన్స్‌ఫార్మర్ ఎగ్జ్‌ఫ్యూజ్ వేయడానికి వెళ్లి విద్యుదాఘాతానికి గురై తీవ్రగాయాలపాలయ్యాడు. ప్రాణాపాయ స్థితిలో అంపశయ్యపై రోజులు లెక్కిస్తున్నాడు. ఊరు తన కుటుంబ సభ్యుడికి ఆపద వచ్చిందని శోకిల్లుతుంది. ఆపద్బాంధవుడిని కాపాడుకోవడానికి అండగా నిలుస్తుంది. లక్షల్లో ఖర్చు అవుతుండటంతో బాధితుడి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, ప్రతిపక్ష పార్టీలు, దయార్ధ హృదయులు ఆదుకోవాలని చేతులెత్తి వేడుకుంటున్నారు.. మండలంలోని తొగర్రాయి గ్రామానికి చెందిన తుమ్మలపెల్లి రామరాజు విద్యుత్ శాఖలో తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఈనెల 9న గ్రామానికి చెందిన కొంతమంది రైతుల వ్యవసాయ పంపుసెట్లు విద్యుత్ సరఫరా రాని కారణంగా రామరాజును తీసుకెళ్లారు. ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కి ఎగ్జ్‌ఫ్యూజ్ వేస్తుండగా ప్రమాదవశాత్తు 11 కేవీ విద్యుత్ తీగలు తగలడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే హనుమకొండలోని ఓ ప్రై వేట్ ఆస్పత్రికి తరలించారు. ఎడమచేయి తీసివేయగా కుడిచేయి కొంత ఇన్‌ఫెక్షన్‌కు గురైంది. కాలుకు తీవ్రగాయాలయ్యాయి. రోజుకు లక్షల్లో ఖర్చు అవుతుంది. ఇప్పటికే రూ. 8 లక్షలు ఖర్చు అయ్యాయి. ఇంకా రూ.10 లక్షల వరకు ఖర్చయ్యే అవకాశం ఉండటంతో గ్రామస్తులంతా తమకు తోచినంత విరాళాలు ద్వారా రూ. 3 లక్షలు సేకరించి వైద్యంకోసం అందజేశారు. దయార్థ హృదయులు, ప్రభుత్వం, పాలకులు స్పందించి ఆర్థిక సాయం అందించి రామరాజుకు ప్రాణభిక్ష పెట్టాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

# ఇక పార్టీ సంస్థాగత ఎన్నికలు

- మండల వారీగా సన్నాహక సమావేశాలు
- పోటీదారుల నుంచి బయోడేటా ఆహ్వానం
- నేడు వర్ధన్నపేట, పర్వతగిరి మండలాల్లో సమావేశం

హసన్‌పర్తి : కాంగ్రెస్ సంస్థాగత ఎన్నికలకు సమాయత్తమైంది. ఈ మేరకు వర్ధన్నపేట నియోజకవర్గంలోని మండలాల్లో పార్టీ సన్నాహక సమావేశాలు నిర్వహిస్తోంది. బుధవారం పర్వతగిరి, వర్ధన్నపేట టౌన్, వర్ధన్నపేట మండలం, 3వ డివిజన్, 14వ డివిజన్, 43వ డివి జన్‌ల సన్నాహక సమావేశం నిర్వహించనున్నారు. వర్ధన్నపేటలోని ఎబీఎస్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 11 గంటలకు సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు, ఎంపీ కడి యం కావ్య, పీసీసీ అబ్జర్వర్ ఆమీర్ లీఖాన్, మేడింరవిచంద్ర, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణలు హాజరుకానున్నారు.

**పోటీదారుల నుంచి బయోడేటా స్వీకరణ**

మండల పార్టీ అధ్యక్షుడి పోటీ చేసే వారి నుంచి బయోడేటాను స్వీకరించనున్నారు. పోటీ చేసే వారు ఆధార్, ఓటరుకార్డుతో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో రావాలని సూచించారు. బయోడేటాను పీసీసీ అబ్జర్వర్‌లకు అందించాలన్నారు.

**తీవ్ర పోటీ...**

డివిజన్, మండల అధ్యక్ష పదవికి పోటీ చేసే వారి సంఖ్య భారీగా ఉన్నట్లు పార్టీవర్గాలు పేర్కొంటున్నా యి. వర్ధన్నపేట, పర్వతగిరి అధ్యక్ష పదవులకు పెద్ద సంఖ్యలో బయోడేటాలు అందించనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**సామాజిక వర్గానికే పరిగణలోకి**

ఇదిలా ఉండగా, మండలాలు, డివిజన్‌ల్లో ఆయా సామాజిక వర్గాలను పరిగణలోకి తీసుకుని అధ్యక్షుడిగా నియమించాలని పార్టీ వర్గాలు భావిస్తున్నట్లు తెలిసింది. అన్ని వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వాలని పార్టీ సూచించినట్లు సమాచారం.

# బాధిత కుటుంబాలకు పరామర్శ



నర్సంపేట: మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



పర్వతగిరి: బాధిత కుటుంబ సభ్యులకు బియ్యం అందజేస్తున్న రాజుయాదవ్

నర్సంపేట : చెన్నారావుపేట మండలం పాపయ్యపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కుండె ముత్తయ్య అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. పరామర్శించిన వారిలో గ్రామ పార్టీ అధ్యక్షుడు కంచ ప్రభాకర్, మాజీ ఉపసర్పంచ్ మేడి వెంకటేశ్వర్లు, మండల రవి, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహ్మద్ అమిరుద్దీన్, మాజీ వార్డు సభ్యులు స్వామి, భద్రయ్య, సుధాకర్, కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

**బియ్యం అందజేత**

నర్సంపేట: చెన్నారావుపేట మండలం పాత మగ్దుంపురం గ్రామానికి చెందిన జన్ను యాకమ్మ ఇటీవల మృతి చెందింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు 50 కిలోల బియ్యం అందజేసి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. పరామర్శించిన వారిలో మాజీ ఉపసర్పంచ్ సత్యం, నాయకులు భిక్షపతి, శంకేసి రంజిత్ ఉన్నారు.

**పరామర్శ**

పర్వతగిరి : మండలంలోని వడ్లకొండ గ్రామానికి చెందిన ముద్రబోయిన పట్టాభి, బేతి సాంబయ్యలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ఆమడగాని రాజుయాదవ్ బాధిత కుటుంబ సభ్యులకు 50 కిలోల బియ్యం అందజేసి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పట్టాపురం వెంకట్‌రాజు, చందసాని అశోక్, చింతకాయల సమ్మయ్య, రమేష్, పిట్టల సాంబయ్య, తదితరులు ఉన్నారు.

# అదను చూసి విత్తనాలు విత్తుకోవాలి

ఐనవోలు : రైతులు భూమి పదను ఉన్నప్పుడే అదను చూసుకుని విత్తనాలు విత్తుకోవాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వెంకట్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని కక్కిరాలపల్లి గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన హాజరైన మాట్లాడుతూ.. విత్తనాలు మొలకెత్తడానికి సరిపడ వర్షం కురవకముందే రైతులు తొందరపడి పత్తి విత్తనాలు విత్తుకుని నష్టపోతున్నారన్నారు. గ్రామాల్లో పలు కారణాలతో చెట్లు నరికడంతో పర్యావరణంలో మార్పులు వచ్చి సరైన సమయంలో వర్షాలు కురవడం లేదన్నారు. గ్రామాల్లో కూడా చెట్లు పెంచాలని చెప్పే రోజులు వచ్చాయన్నారు. రానున్న రోజుల్లో అధిక ఆక్సిజన్‌ను ఇచ్చే చెట్ల పెంపకం కోసం రైతులు, కార్పొరేట్ సంస్థలతో ఎంఓయూ కుదుర్చుకునే అవకాశాలు ఉన్నాయన్నారు. అందుబాటులో ఉన్న వరి, పెసరా, కందుల విత్తన రకాల గురించి రైతులకు వివరించారు. పంట మార్పిడి గురించి, సస్యరక్షణ చర్యల గురించి చెప్పారు. జనుము, జీలుగ పచ్చిరొట్ట ఎరువుల ప్రాముఖ్యత గురించి చెప్పారు. బలంలేని భూముల్లో అధిక సాంద్రతలో మొక్కలు నాటుకోవాలని సూచించారు. మేలు చేసే శిలింద్రాల కోసం మన ప్రాంత భూముల్లో సూడోమోనాస్ అద్భుతంగా పనిచేస్తుందన్నారు.

# భోజన పథకాన్ని అక్షయపాత్రకు ఇవ్వొద్దు



ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

విద్యారణ్యపురి: జిల్లాలో హనుమకొండ, కాజీపేట, హసన్‌పర్తి మండలాల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్రకు అప్పగించాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ డీఈఓ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్రకు అప్పగించాలనే నిర్ణయంతో తామంతా రోడ్డున పడుతామని కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసు సిబ్బందితో సుబేదారి పోలీస్‌స్టేషన్ సీఐ సత్యనారాయణరెడ్డి అక్కడికి చేరుకుని ఆందోళన విరమింపజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, బాధ్యులు పాల్గొన్నారు.